సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 19 । జూలై । 2024



టన్ను చీనీ రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి



ఉచిత మెడికల్ క్యాంప్ ప్రారంభం
గురుపౌర్ణమి సందర్భంగా సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం ప్రశాంతి నిలయంలో ఉచిత మెడికల్ క్యాంప్ ప్రారంభమైంది.
8లో

గరిష్టం/కనిష్టం
35.4°/22.8°
జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సకాలంలో నిత్యావసరాల పంపిణీ

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: మండలస్థాయిలోని గోడౌన్ల ద్వారా గ్రామాల్లోని చౌక దుకాణాలకు నిత్యావసర సరుకులు త్వరగా సరఫరా చేసి సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కోర్టు హాల్లో పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకుల పంపిణీకి సంబంధించి పలు సూచనలు చేశారు. పౌర సరఫరాలకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఆగస్టు నెలలో కార్డుదారులకు కిలో బియ్యం బదులు కిలో జొన్నలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కందిపప్పు, రెండు రకాల బియ్యం సబ్సిడీ ధరతో అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, మేనేజర్ అశ్వర్థ నారాయణనాయక్, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా అనిత



ప్రొఫెసర్ బి.అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ (ఎస్కేయూ) ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ బి.అనిత నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బి.అనితకు అపారమైన బోధన, పరిశోధనానుభవం ఉంది. 14 ఏళ్లు ప్రొఫెసర్, ఎనిమిదేళ్లు అసోసియేట్, ఎనిమిదేళ్లు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.

జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీగా సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్ అయిన సుదర్శనరావు గతంలోనూ ఇన్‌చార్జ్ వీసీగా పనిచేశారు. తాజాగా మరో దఫా ఇన్‌చార్జ్ వీసీగా అవకాశం దక్కడం గమనార్హం. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ వీసీకి ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. బోధన సిబ్బందితో పాటు పలువురు ఆయనకు అభినందనలు తెలిపార

డీలర్లపై అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు

- రాజీనామా చేయాలని ఆదేశాలు

రొళ్ల: మండల వ్యాప్తంగా 26 ప్రభుత్వ ఎఫ్‌పీ షాపులు ఉండగా అందులో రెగ్యులర్ షాపులు 7 ఉన్నాయి. మిగిలిన 19 షాపులకు డీలర్లు లేరు. దీంతో మహిళా సంఘాల ద్వారా తాత్కాలిక డీలర్లు ప్రతి నెలా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుత అధికార టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు మహిళ సంఘాల పేరు మీద నడుపున్న డీలర్లు రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఆయా షాపులను తమకు కేటాయించాలని సంబంధిత అధికారులతో పాటు తాత్కాలిక డీలర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం మహిళ సంఘాల పేరుమీద నడుపుతున్న డీలర్లు తమకు మూడు నెలలకు సంబంధించిన కమీషన్ మొత్తాన్ని అందజేస్తే తాము రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (సిడాప్) ఆధ్వర్యంలో ఉచిత కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మక్బుల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం ఒక ప్రకనటలో తెలిపారు. ఎంబ్రాయిడరీ మగ్గం వర్క్ కోర్స్‌ను బుక్కపట్నం సత్యసాయి డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. 5, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదవిన వారు అర్హులన్నారు. కోర్సు నాలుగు నెలలు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్‌కార్డు జిరాక్స్, మొబైల్ నంబర్‌తో సహా సిల్క్ హబ్ కోఆర్డినేటర్ భారతి సంప్రదించాలన్నారు. వివరాలకు 7981541994 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

45 రోజులకే.. నరకయాతన

- కూటమి పాలనపై ప్రజల విసుగు
- నెలన్నర రోజులుగా అభివృద్ధి శూన్యం
- హత్యారాజకీయాలకు ఆజ్యం
- అన్ని ప్రాంతాల్లో దందాలకు తెరతీసిన నాయకులు
- కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి సరిగ్గా ఒకటిన్నర నెల పూర్తి



'రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొల్పుతాం... అవినీతి లేని సుపరిపాలనకు శ్రీకారం చుడతాం... హత్యారాజకీయాలకు చరమగీతం పాడుతాం... సంక్షేమ పాలనతో అన్ని వర్గాలకూ న్యాయం చేస్తాం' ఇలా... ఎన్నికలకు ముందు కూటమి నేతలు అనేక ప్రగాల్భాలు పలికారు. అయితే అధికారం చేపట్టగానే చెప్పిన మాటలకు చేస్తున్న పనులకు మాత్రం ఎక్కడా పొంతన లేకుండా పోయింది. సంక్షేమాభివృద్ధిని పక్కన పెట్టేసి హత్యారాజకీయాలు, అవినీతి దందాకు తెర తీశారు. దీంతో కూటమి పాలన సామాన్య ప్రజలు విసుగు చెందారు.

సాక్షి, పుట్టపర్తి: టీడీపీ – బీజేపీ – జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఏదో ప్రాంతంలో దాడులు జరుగుతుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అభివృద్ధి మాట మరిచి.. ఇచ్చిన హామీలు అమలు గురించి పట్టించుకోకుండా.. నిత్యం అరాచకాలు, కబ్జాలు, దందాలు, దౌర్జన్యాలు చేయడం ఏంటని ప్రజలు ఆగ్రహాన్ని వెళ్లగక్కుతున్నారు.

అన్ని నియోజకవర్గాల్లోనూ అంతే...
జిల్లాలోని హిందూపురం పార్లమెంటులోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఒక్కో చోట ఒక్కో రకమైన చేష్టలు వెలుగు చూశాయి. టీడీపీ శ్రేణులు అత్యుత్సాహంతో బరితెగించి దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులు కేసులు కూడా నమోదు చేయడం లేదు. ఒకవేళ చేసినా నిందితులను పట్టుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత 45 రోజులుగా నరకయాతన చూస్తున్నామని పలు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇచ్చే పింఛన్ సొమ్ము కూడా చేతికందకుండా టీడీపీ నేతలు అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారం అండతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులు, హెచ్చరికలు చేస్తున్నారు.

బదిలీల పేరుతో అధికారులపై పెత్తనం..
తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. చెప్పినట్లు వింటే కోరిన చోటుకు పోస్టింగ్ ఇప్పిస్తామని పలువురు కూటమి నేతలు అధికారులను మభ్యపెడుతున్నారు. మాటవినకపోతే మండలస్థాయి నుంచి సబ్ డివిజన్, జిల్లా స్థాయి వరకు ఉద్యోగులపై బదిలీల వేటు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇందులో వీఆర్‌ఓ, తహసీల్దార్, ఎస్‌ఐ, సీఐలపై చాలా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ప్రాంతాల వారీగా ఆదాయ అన్వేషణలో భాగంగా మంచి పోలీస్‌స్టేషన్, మెచ్చిన తహసీల్దార్ కార్యాలయంలో పోస్టింగులు వచ్చేందుకు కొందరు ఎమ్మెల్యేల వద్ద ఏజెంట్లుగా మారినట్లు తెలిసింది. పోస్టింగులు ఇప్పిస్తామని రూ.లక్షల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

రామగిరిలో రాక్షస క్రీడ..
టీడీపీ నేతల దాడులతో నసనకోట, కొత్తపల్లి గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు సానుభూతి పరులు కూడా గ్రామాలు వదిలి వెళ్లిపోయారు. ఎంసీ పల్లి, చెర్లోపల్లిలో పలువురికి పింఛన్లు ఇవ్వకుండా అడ్డుకున్నారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత కనుసన్నల్లోనే అధికారులందరూ పనిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పుట్టపర్తిలో వసూళ్ల పర్వం..
ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసుకుని తెలుగు 'తమ్ముళ్లు' డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. షాపులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కొనసాగాలంటే మనీ ఇవ్వాలని, లేకపోతే కేసుల్లో ఇరికిస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. ఇలాంటి ఘటనలు పదికి పైగా జరిగినా.. పోలీస్‌స్టేషన్‌కు కూడా వెళ్లకుండా అడ్డుకున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు డబ్బులు ముట్టజెప్పి వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలిసింది.

మడకశిరలో 'తమ్ముళ్ల' ఓవరాక్షన్..
ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తాము చేస్తున్న పనులను చెప్పకుండా ప్రతిపక్షంపై ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎఫ్‌పీ షాపుల డీలర్లను బెదిరింపులకు గురిచేస్తూ తమవారికే కేటాయించేలా తమ్ముళ్ల వార్నింగులు ఇస్తున్నారు.

ధర్మవరంలో దందాల జోరు

ధర్మవరం నియోజకవర్గంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలు అడ్డగోలుగా అవినీతికి దందాకు తెరలేపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తాము చెప్పిందే వేదమంటూ దౌర్జన్యానికి దిగుతున్నారు. అధికారులపై జులుం ప్రదర్శిస్తున్నారు. మూడు పార్టీల నేతలూ తలో వైపు దందా చేయడం మొదలుపెట్టడంతో సామాన్య జనం తలలు పట్టుకుంటున్నారు.





కియా కంపెనీలో 'పెత్తనం'

కియా కార్ల కంపెనీలో పలు కాంట్రాక్టర్ల కోసం టీడీపీ ఎమ్మెల్యేలు భారీగా లాబీయింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఓ వైపు మంత్రి సవితమ్మ, ఎంపీ బీకే పార్థసారథి, మరో వైపు ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కియా యాజమాన్యంపై ఒత్తిడి తెస్తోన్నట్లు తెలిసింది. పాలన మరిచి స్వలాభం కోసం వెంపర్లాడుతున్నట్లు స్పష్టం అవుతోంది.

'పురం'లో హత్యా రాజకీయం



సతీష్ (ఫైల్)

హిందూపురం రూరల్ మండలం గోళ్లాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సతీష్‌ను ఈనెల 3వ తేదీన టీడీపీ కార్యకర్తలు చితకబాదారు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సతీష్ మృతి చెందాడు. హిందూపురం రూరల్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కానీ ఇంతవరకు నిందితులను మాత్రం పట్టుకోలేదు.

తలుపులలో అకారణంగా దాడి



తీవ్రంగా గాయపడిన చెన్నకృష్ణారెడ్డి

గత నెల 5న తలుపుల మండలం గరికిపల్లెలో వైఎస్సార్‌సీపీ నేత చెన్నక్రిష్ణారెడ్డిపై టీడీపీ కార్యకర్తలు అకారణంగా దాడి చేశారు. తలకు బలంగా గాయమైంది. టపాసులు పేలుస్తూ.. అల్లరి చేస్తుండగా.. ఎందుకిలా? చేస్తున్నారని ప్రశ్నించినందుకు సమాధానం చెప్పకుండా కర్రలతో దాడి చేశారు. చెన్నకృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడనే కారణంగా చితకబాదారు.

'సరిహద్దు'లో నిఘా పటిష్టం చేయాలి

- సెబ్ అధికారులతో కలెక్టర్ చేతన్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి నాటుసారా, మద్యం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించాలని ఎక్సైజ్ ,సెబ్ అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ అభిషేక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ విష్ణు, ఎక్సైజ్ శాఖ అధికారి సహదేవయ్య, విద్యుత్‌శాఖ అధికారి మోసెస్, శివశంకర్‌రెడ్డి తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో భద్రత కట్టు దిట్టం చేయాలన్నారు. పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా దర్యాప్తులు చేసి పూర్తి చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణపై ఉక్కు పాదం మోపాలన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలో అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్లు విద్యుత్ అందజేస్తున్నారా? లేదా? అని ఆరా తీశారు. విద్యుత్ కనెక్షన్ల కోసం వచ్చిన రైతులకు త్వరగా మంజూరు చేయాలన్నారు. ఎ

మాతా శిశు మరణాలను అరికట్టాలి..
మాతా శిశు మరణాలను అరికట్టాలని, గర్భిణీలకు అందించే న్యూట్రిషన్ ఫుడ్‌ను సంపూర్ణంగా తీసుకునేలా చూడాలని కలెక్టర్ చేతన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో జాతీయ ఆరోగ్య మిషన్, డీసీహెచ్‌ఎస్, మలేరియా, ఎయిడ్స్ కంట్రోల్, , ఇమ్యునైజేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన ద్వారా సమీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్యులు స్థానికంగానే నివాసం ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మంజువాణి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి..
ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం పుట్టపర్తిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి నిలువ ఉంచిన పప్పు దినుసులు, ,కోడిగుడ్లు ఇతర సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంను మెనూ ప్రకారం అందించాలన్నారు. గుడ్లు, రాగిజావా సక్రమంగా అందించాలన్నారు. హాజరు ప్రకారం భోజనం, గుడ్లు సిద్ధం చేయాలని ఆదేశించారు.

జిల్లా జడ్జి, డీఐజీని కలిసిన ఎస్పీ





జిల్లా జడ్జి శ్రీనివాస్, డీఐజీ షిమోషిని కలిసి పూల మొక్కలను అందజేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్/అర్బన్: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రత్న అనంతపురంలో కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి శ్రీనివాస్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రేంజ్ కార్యాలయంలో డీఐజీ డాక్టర్ షిమోషిని కలిసి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ఇతరత్రా అంశాలపై చర్చించారు. అనంతరం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాద పూర్వరంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థితి గతులపై చర్చించారు.

భారీ వర్షసూచన.. అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారని, ఈ నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడా ప్రాణనష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని బత్తలపల్లి, ఎన్‌పీ కుంట, నల్లమాడ, కదిరి, ఓడీ చెరువు, నల్లచెరువు, హిందూపురం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైభవంగా భూతప్ప ఉత్సవం



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

- భక్తులతో కిక్కిరిసిన భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణం



భక్తులపై నడుస్తున్న భూతప్పలు

మడకశిరరూరల్: ఏకాదశి సందర్భంగా మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద గురువారం భూతప్ప ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ఉపవాస దీక్ష, పంచామృతాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, సంతానం లేని మహిళలు భక్తిశ్రద్ధలతో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద భూతప్పల స్పర్శ కోసం దారిలో పడుకున్నారు. స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తూ భక్తులపై భూతప్పలు కాలుమోపుతూ దేవాలయానికి చేరుకున్నారు. భూతప్పలు కాలుమోపితే రోగాలు నయమై మహిళలకు సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. భూతప్పలు కాలుమోపిన భక్తులు దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భూతప్పల స్పర్శకోసం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

తుంగభద్రకు భారీగా వరద



టీబీ డ్యాంలో చేరిన నీరు

- రికార్డు స్థాయిలో 1.21 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతపురం సెంట్రల్/ బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద భారీగా చేరుతోంది. బుధవారం 49,522 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం రికార్డు స్థాయిలో 1,21,160 క్యూసెక్కులకు పెరిగింది. ఎగువన శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు, వరనాడు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎగువన అప్పర్ తుంగా ప్రాజెక్ట్ నిండటంతో గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దానికి తోడు రిజర్వాయర్ పరిసరాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరుగుతూ వస్తున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు వెల్లడించారు. ప్రారంభంలో డ్యాంకు ఇన్‌ఫ్లో అనుకూల స్థాయికి చేరి, ఆ తర్వాత చాలా రోజులు ఇన్‌ఫ్లో తగ్గి రైతులను ఆందోళనకు గురి చేసింది. ఈసారి ముందుగా వర్షాలు కురువడం, ఇన్‌ఫ్లో పెరగడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రానికి 50.025 టీఎంసీలకు చేరుకుంది. మరో కొద్దిరోజుల పాటు ఇన్‌ఫ్లో కొనసాగితే జలాశయం పూర్తిగా నిండనుంది. డ్యాం నుంచి 300 క్యూసెక్కుల నీటిని రాయబసవన కెనాల్, జిందాల్‌కు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు వరి, మిరప నార్లు బోర్ల కింద సాగు చేస్తున్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి 1,589.90 అడుగుల నీటి మట్టంతో 10.947 టీఎంసీల నీరు జలాశయంలో నిల్వ ఉంది.

TET+DSC-SGT,SA సోషియల్
ఫ్రీ గ్రాండ్ టెస్ట్ & డెమో 21-07-2024 @ 10 AM
అనంత భవిత DSC అకాడమి
సప్తగిరి సర్కిల్, అనంతపురము.7997592299

క్లుప్తంగా

డెంగీ బాధితురాలికి పరామర్శ


బాధితురాలితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మంజువాణి

పెనుకొండ: స్థానిక 1వ సచివాలయ పరిధిలో నమోదైన డెంగీ కేసులో బాధితురాలిని గురువారం ఉదయం డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి పరామర్శించారు. కేసు రిపోర్ట్ పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దోమ తెరలు వాడాలని సూచించారు. పట్టణంలో ఫాగింగ్ చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ సౌమ్య, ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, సిబ్బంది హేమ, సుధాకర్, ఏఎన్ఎం ఉమాదేవి తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి


సీఐతో మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న

ధర్మవరం రూరల్: మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఎస్పీ వి.రత్న సూచించారు. గురువారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. జూదం, గంజాయి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లేపాక్షి: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన అజాజ్ అహమ్మద్(40) ఏడాదిగా నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన బుధవారం రాత్రి 11 గంటల సమయంలో లేపాక్షి మండలం చోళసముద్రం గ్రామ రోడ్డు పక్కన చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల నుంచి గురువారం ఉదయం సమాచారం అందుకున్న ఎస్ఐ గోపి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనాస్థలంలో లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని అజాజ్ అహమ్మద్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుని తండ్రి మహబూబ్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కోర్ బ్రాంచ్‌లకు పెరిగిన క్రేజ్

- ఏపీ ఈఏపీసెట్‌లో ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు పూర్తి
- కంప్యూటర్ సైన్సెస్‌కు తొలి ప్రాధాన్యత
- నాణ్యత ప్రమాణాలున్న కళాశాలలో కోర్ బ్రాంచ్‌లైనా పర్వాలేదు
- ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌లపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



జేఎన్‌టీయూ కళాశాల ప్రధాన ద్వారం

అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో తొలి విడత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోపు నేరుగా కళాశాలల్లో రిపోర్టు చేయాలి. అయితే ఈ నెల 19 నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి. జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో 396 సీట్లు ఉండగా 389 సీట్లు, ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలో 330 సీట్లకు గాను 255 భర్తీ అయ్యాయి. జేఎన్‌టీయూ(ఏ)లో మొత్తం 6 విభాగాలు ఉండగా ప్రతి విభాగంలో 66 చొప్పున సీట్లు ఉన్నాయి. కెమికల్ ఇంజినీరింగ్‌లో 65, సివిల్ ఇంజినీరింగ్ 64, కంప్యూటర్ సైన్సెస్ 66, ఈసీఈ 65, ఈఈఈ 64, మెకానికల్ విభాగంలో 65 సీట్లు భర్తీ అయ్యాయి.

బ్రాంచ్ కన్నా కళాశాలే ముఖ్యం..

గతేడాది కంప్యూటర్ సైన్సెస్ కోర్సుల వైపు అత్యధిక శాతం విద్యార్థులు ఆసక్తి చూపించారు. దీంతో కంప్యూటర్ సైన్సెస్ వాటి అనుబంధ కోర్సులకు అప్పట్లో భారీ డిమాండ్ నెలకొంది. తాజాగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చింది. కోర్సు కంటే కళాశాల వైపు మొగ్గు చూపుతున్నారు. నాణ్యత ప్రమాణాలు గల కళాశాలలో సీటు దక్కితే చాలు బ్రాంచ్ ఏదైనా పర్వాలేదనే ధోరణి వ్యక్తమవుతోంది. దీంతో ఈ విద్యా సంవత్సరంలో కంప్యూటర్ సైన్సెస్‌తో పాటు కోర్ బ్రాంచ్‌లు అయిన ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ కోర్సులకూ డిమాండ్ నెలకొంది. మంచి ర్యాంక్ వచ్చిన విద్యార్థులు తమ తొలి ప్రాధాన్యతగా కంప్యూటర్ సైన్సెస్‌కు ఆప్షన్ ఇచ్చారు. జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాలలో కంప్యూటర్ సైన్సెస్ బ్రాంచ్‌కు సంబంధించి తొలి ఐదు సీట్లను రాష్ట్ర స్థాయిలో 889, 1013, 1221, 1446, 1502 ర్యాంకులు సాధించిన వారు దక్కించుకున్నారు. ఈసీఈ విభాగంలో 1,871, 2,077, 2,409, 2,805, 2,977 ర్యాంకుల వారికి తొలి ఐదు సీట్లు దక్కాయి. ఎస్ఆర్ఐటీ (అటానమస్)లో 10,949 నుంచి 12,751 లోపు ర్యాంకు వారికి సీఎస్ఈ సీట్లు దక్కాయి.

ఉమ్మడి జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో భర్తీ అయిన సీట్ల వివరాలు

కళాశాల	అనుమతించిన సీట్లు	భర్తీ అయినవి
ఎస్ఆర్ఐటీ	576	545
అనంతలక్ష్మి	720	687
గేట్స్	624	585
ఎస్ఎస్ఎస్ఈ	288	263
పీవీకేకే ఓసీ	288	238
పీవీకేకే	384	280
ఎస్వీఐటీ	408	280
సీవీఆర్‌టీ	300	195
టెక్	336	205
సంస్కృతి	288	263

స్పెయిన్ కోచ్‌ల శిక్షణను సద్వినియోగం చేసుకోండి


స్పెయిన్ కోచ్‌లతో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: స్పెయిన్ కోచ్‌ల శిక్షణను సద్వినియోగం చేసుకుని బాస్కెట్‌బాల్ క్రీడలో రాణించాలని క్రీడాకారులకు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బాస్కెట్‌బాల్ క్రీడలో నైపుణ్యాలు గడించేలా ధర్మవరం క్రీడాకారులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని గురువారం స్పెయిన్ కోచ్‌లు మార్, ఒరియోల్, పోల్, నటాలియాతో కలసి ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఆర్డీటీ సహకారంతో ఈ నెల 30వ తేదీ వరకూ రోజూ ఉదయం, సాయంత్రం స్పెయిన్ కోచ్‌లు శిక్షణ ఇవ్వనున్నారన్నారు. గతంలో స్పెయిన్ కోచ్‌ల వద్ద శిక్షణ పొందిన క్రీడాకారులు నేడు జాతీయ స్థాయి జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. అనంతరం బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌ను స్పెయిన్ బృందం అందజేసింది. కార్యక్రమంలో ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్, జస్వంత్, హరిజిత్ ప్రణవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

దాడి చేస్తే కేసు నమోదు చేయరా?

- పోలీసుల తీరుపై మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మండిపాటు


విలేకరులతో మాట్లాడుతున్న కేవీ ఉషశ్రీచరణ్

రొద్దం: విచక్షణ మరిచి టీడీపీ కార్యకర్తలు దాడులు సాగిస్తున్నా... పోలీసులు పట్టించుకోవడం లేదని, స్వయంగా బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని మాజీ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. బుధవారం టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మనోహర్, సుమలతను గురువారం ఆమె ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న కక్షతో టీడీపీ నేతలు విచక్షణ మరిచి దాడులకు తెగబడుతున్నారన్నారు. బీసీ శాఖ మంత్రి సవితమ్మ నియోజకవర్గంలోనే బీసీలు, ఎస్సీలపై దాడులు చోటు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. ఘటన జరిగి 24 గంటలైనా ఇప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వయంగా క్షతగాత్రుడి తండ్రి ఫిర్యాదు చేయడానికి వెళితే పోలీసులు కనీస సమాచారం కూడా తెలుసుకోకుండా నిర్దాక్షిణ్యంగా బయటకు పంపారంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతకు దిగజారాయో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఎస్ఐ వలీబాషా తీరును ఆమె ఖండించారు. ఘటనపై కేసు నమోదు చేయకపోతే పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయానికి పసుపు రంగు

రామగిరి: రాష్ట్రవ్యాప్తంగా కూటమి నేతలు పంచాయతీ కార్యాలయాలకు పసుపు రంగు పులిమేస్తున్నారు. శిలాఫలకాలకు, పార్కులో బెంచీలకు కూడా పసుపు రంగు వేస్తున్నారు. తాజాగా రామగిరి మండలం పేరూరు పంచాయతీలోని గ్రామ సచివాలయానికి పసుపు రంగు వేశారు. ఈ చర్యలను స్థానికులు తప్పుబడుతున్నారు. ఇది సచివాలయమా... లేక టీడీపీ కార్యాలయమా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సేవచేయాలంటే రంగులు అవసరం లేదని, సేవాగుణం ఉంటే చాలని హితవు పలుకుతున్నారు.


పేరూరు సచివాలయానికి పసుపురంగు వేసిన దృశ్యం

వైభవంగా జ్యోతుల ఉత్సవం

మడకశిర రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా మడకశిర మండలం గౌడనహళ్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి, మెళవాయి వెలసిన రంగనాథస్వామికి గురువారం భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్, ఆలయం వద్ద భక్తుల సందడి


మెళవాయిలో రంగనాథస్వామి జ్యోతుల ఉత్సవం


జమ్మానిపల్లి నుంచి ఊరేగింపుగా జ్యోతులు తెస్తున్న దృశ్యం

'పుర'పాలక అకౌంట్స్ విభాగం
అవినీతిపై ఫిర్యాదు

- రూ.కోట్లలో నిధులు దుర్వినియోగం అయ్యాయని ఏసీబీకి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ లేఖ

హిందూపురం: స్థానిక మున్సిపాలిటీలోని అకౌంట్స్ విభాగంలో రూ.కోట్ల మేర అవినీతి జరిగిందని, సంబంధిత విభాగం అధికారులే ఇందుకు కారణమంటూ ఇటీవల ఏసీబీ అధికారులకు చైర్‌పర్సన్ ఇంద్రజ లేఖ రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన స్పెషల్ గ్రాంట్‌తో మున్సిపాల్టీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు నిబంధనలు తుంగలో తొక్కి చెక్కుల రూపంలో బిల్లులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మొత్తం తతంగం గతంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్లు ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వరరావుతో పాటు, ఏఈ నాగేంద్ర, అకౌంటెంట్ మనోహర్ కనుసన్నల్లోనే సాగిందని వివరించారు. ఈ అక్రమాల వెనుక పెద్ద మొత్తంలో కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. మురుగు కాలువల్లో పూడిక తీత, కంపోస్టు యార్డ్ క్లీనింగ్ తదితర పనులు యంత్రాలతో చేయించినట్లు రికార్డుల్లో చూపి, ఒకే కాంట్రాక్టర్‌తో నామమాత్రపు పనులు చేయించి నిధులు కాజేశారన్నారు. ఈ లెక్కన దాదాపు రూ.కోట్ల మేర నిధులు పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై గత ఏడాది డిసెంబర్‌లో అప్పటి కలెక్టర్ అరుణ్‌బాబుకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, ఆయన సమగ్ర విచారణ చేపట్టాలంటూ మున్సిపల్ ఆర్డీకి సిఫారసు చేశారని లేఖలో గుర్తు చేశారు. అలాగే 2020కు సంబంధించి చెక్కులను గత ఏడాది పంపిణీ చేశారని, దీనిపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తాజాగా ఏసీబీకి లేఖ రాశారు.

ఉచిత మెడికల్ క్యాంప్ ప్రారంభం

ప్రశాంతి నిలయం: సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రశాంతి నిలయంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను ప్రారంభమైంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు, గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్యతో కలసి గురువారం మెడికల్ క్యాంప్ ప్రారంభించారు. ప్రశాంతి నిలయం నార్త్ బిల్డింగ్స్ దగ్గర మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. దేశ విదేశాలకు చెందిన 100 మంది స్పెషాలిటీ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, మెడికల్ క్యాంప్‌లో పాల్గొని సేవలు అందిస్తున్నారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకూ మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు. ఈఎన్‌టీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ, గైనకాలజీ, డెంటల్, పీడియాట్రిక్ తదితర విభాగాలకు సంబంధించి వైద్య సేవలు అందిస్తున్నారు. రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకూ రెండు షిఫ్ట్‌ల ప్రకారం సేవలు అందిస్తున్నారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా పుట్టపర్తికి తరలివచ్చే భక్తులతో పాటు స్థానికులకు ఉచిత వైద్య సేవలు అందించే లక్ష్యంతో మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

హిందూపురం పురపాలక సంఘం
"ఇ" ప్రొక్యూర్‌మెంట్

టెండరు నోటీసు నెం. 38-49/HDP/GENL/2024-25/TO, Dt: 12-07-2024

1. సాధారణ నిధులు 12 నెం. రూ. 87.35 లక్షలు

ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 15-07-2024 ఉ॥ 11-00 గం॥లకు
ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్‌లోడింగ్ చివరి తేది : 29-07-2024 సా॥ 3-30 గం॥లకు
బిడ్ తెరిచే తేది : 29-07-2024 సా॥ 4-00 గం॥లకు

గమనిక : ఎగ్జిక్యూటివ్ అథారిటి వారి ఆదేశాల ప్రకారం ఏమేని మార్పులు చేసిన "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో తెలుసుకోగలరు. తదుపరి వివరములకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.
ఆఫీసు చిరునామా:- కమిషనరు, హిందూపురం పురపాలక సంఘం,
ఫోన్ నెం: 9849907408.

సం/- కమిషనరు, హిందూపురం పురపాలక సంఘం

రిజిస్ట్రేషన్ దందాపై కదిలిన యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం: 'ధర్మవరంలో దౌర్జన్యకాండ' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. కూటమి నేత దౌర్జన్యంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల నిలుపుదల అంశంపై ఇంటెలిజెన్స్, ఎస్‌బీ అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. రేగాటిపల్లి పంచాయతీ సర్వే నంబర్ 293, 294లో భూయజమానులను బెదిరించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న 65 సెంట్లకు సంబంధించి విచారణ చేస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు రేగాటిపల్లి పంచాయతీలో గతంలో జరిగిన క్రయవిక్రయాలకు సంబంధించిన పెండింగ్‌లో పెట్టిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయించి వారికి అందించేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి సత్యకుమార్ కార్యాలయం నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు ఆదేశాలు అందినట్లుగా తెలిసింది. ఇకపై ఎవరూ ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా ఖాతరు చేయవద్దని తేల్చిచెప్పినట్లు సమాచారం. దస్తావేజు లేఖరులకు కూడా మంత్రి సత్యకుమార్ భరోసా ఇచ్చినట్లుగా తెలిసింది.

సంయుక్త కలెక్టరు వారి కార్యాలయము,
శ్రీ సత్యసాయి జిల్లా.
తేది : 16-07-2024

బహిరంగ వేలము ప్రకటన

శ్రీయుత జిల్లా సంయుక్త కలెక్టరు, శ్రీ సత్యసాయి జిల్లా వారి ఉత్తర్వుల నెం. Rc.No. K8/63/2024, తేది : 16-07-2024 మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం జప్తు చేయబడి ఈ క్రింద తెలుపబడిన 06 మండల స్థాయి గోదాముల నందు నిల్వ ఉంచిన బియ్యమును వేలము వేయుటకు నిర్దేశించడమైనది.

సీజ్ చేయబడిన బియ్యం (Raw Rice) నిల్వ ఉన్న మండల స్టాక్ పాయింట్లు

క్రమ సంఖ్య	మండల స్థాయి గోదాము పేరు	వేలం నిర్వహించబడు సరుకు మొత్తం (క్వింటాళ్లలో)	బహిరంగ వేలము నిర్వహించు ప్రదేశము, తేది మరియు సమయం	దరఖాస్తు రుసుము మరియు ధరావత్తు	దరఖాస్తు పొందు ఆఖరు తేది, సమయం మరియు ప్రదేశం (డిస్ట్రిక్ట్ సప్లై ఆఫీసర్ ఆఫీస్, కలెక్టర్ ఆఫీస్, శ్రీ సత్యసాయి జిల్లా.)	దరఖాస్తు సమర్పించు చివరి తేది మరియు సమయం
1.	చెన్నేకొత్తపల్లి	884.81	కోర్ట్‌హాల్, కలెక్టరు కార్యాలయము, శ్రీ సత్యసాయి జిల్లా, ఆగస్టు 02వ తేది మధ్యాహ్నం 3-00 గంటలకు	రూ. 3000/- మరియు రూ. 2,00,000/-	బహిరంగ వేలము ప్రకటన ఇచ్చినప్పటి నుండి ఆగస్టు 02వ తేది ఉదయం 11 గంటల వరకు (కార్యాలయ పనివేళలు మరియు పని దినాలలో)	ఆగస్టు 02వ తేది మధ్యాహ్నం 12గంటల వరకు
2.	గాండ్లపెంట	9.32				
3.	కదిరి	1028.50				
4.	మడకశిర	543.90				
5.	ఓబులదేవర చెరువు	1561.20				
6.	పెనుకొండ	613.26				
	మొత్తము	3227.21				

నిబంధనలు : 1. బహిరంగ వేలంలో పాల్గొనదలచినవారు, వేలంలో బియ్యం కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్న ధరను దరఖాస్తు నందు తప్పనిసరిగా పొందుపరచవలెను. 2. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు District Civil Supply Officer, Sri Sathyasai District వారి పేరు మీద చెల్లుబాటు అగునట్లు డి.డి. రూ. 2,00,000/- తీయవలెను. 3. కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంటు వారి లైసెన్స్ ఉన్న ట్రేడర్ / రైస్ మిల్లర్ అయి ఉండవలెను. 4. వేలము ముగిసిన అనంతరం అర్హత పొందని వారికి వేలం కోసం చెల్లించిన ధరావత్తు పైకమునకు సంబంధించిన రసీదు తీసుకొని డి.డి. తిరిగి ఇవ్వబడును. 5. బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత పొందిన వారు వేలం ముగిసిన 5 దినములలో మొత్తం పైకం చెల్లించి, పైకం చెల్లించిన 10 దినములలో సరుకును స్వాధీన పరచుకొని, 30 దినములలో ఉపయోగించుకోవలెను. 6. వేలం పాటలో అర్హత పొంది నిర్ణీత సమయంలోమిగిలిన పైకమును చెల్లించని యెడల ధరావత్తుగా చెల్లించిన సొమ్ము (డి.డి) తిరిగి ఇవ్వబడదు.7. వేలం ద్వారా పొందిన బియ్యాన్ని మళ్లించడం లేదా స్టాకును దుర్వినియోగం చేయడాన్ని నిరోధించుటకు బియ్యం యొక్క తార్కిక ముగింపు వరకు స్టాకు ఉపయోగమును మరియు కదలికల విధానాన్ని రెవెన్యూ / పౌరసరఫరాలు / విజిలెన్సు మరియు ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గమనిస్తూ ఉంటారు. 8. వేలము వేయు సరుకును కార్యాలయ పనిదినములలో వేలము జరుపుటకు ముందు రోజులోపు, దానిని నిల్వ ఉంచిన ప్రదేశము అనగా, పై పట్టికలో కనపరచిన మండల స్థాయి గోదాముల నందు పరిశీలించుకొనుటకు అనుమతించబడును. 9. బహిరంగ వేలంలో ఎక్కువ వేలం పాడిన ట్రేడర్ / రైస్ మిల్లర్ వారు రవాణా మరియు హమాలి ఖర్చులను భరించి పై విడతల వారీగా మండల స్టాక్ పాయింట్ల నుండి బియ్యం తీసుకొనవలెను. 10. ఈ బహిరంగ వేలం అనేది జిల్లా సంయుక్త కలెక్టరు వారి తుది నిర్ణయానికి లోబడి ఉండును.

(For further Information and application format visit http://srisathyasai.ap.gov.in/notice category/announcements/)

సం/- సంయుక్త కలెక్టర్ వారి తరపున, శ్రీ సత్యసాయి జిల్లా.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధర్మవరం రూరల్: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం - చిగిచెర్ల రైల్వే స్టేషన్ల మధ్య గురువారం ఉదయం 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. రైలు నుంచి ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందినట్లుగా ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. కాగా, మృతుడి శరీరంపై ఆర్‌సీబీ క్రికెట్ జట్టుకు చెందిన నీలం రంగు, లేత చిలుక పచ్చ రంగు టీషర్ట్, దానిపై నీలం రంగు ఫుల్ హ్యాండ్స్ కలిగిన స్వెట్టర్, క్రీం కలర్ ప్యాంట్ ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు 94405 57054లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

ఘనంగా వన భోజనాలు


ఆరు బయలులో వంటకాలు చేస్తున్న మహిళలు

రొళ్ల: మండలంలోని దొమ్మరహట్టిలో గురువారం పూర్వీకుల ఆచారాలను పాటిస్తూ భక్తిశ్రద్ధలతో చెట్టు దేవర నిర్వహించారు. గ్రామంలో నివాసమున్న ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉదయాన్నే పిల్లాపాపలతో పాటు పెంచుకున్న జీవాలు, వంట సామగ్రి, ఇతర సరుకులు తీసుకుని ఊరి బయట వేసుకున్న తాత్కాలిక గుడిసెలకు మకాం మార్చారు. గ్రామంలో ఎవరూ ప్రవేశించకుండా ప్రధాన రహదారికి ముళ్ల కంచె చేశారు. ఊరి బయటనే బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సందడిగా గడిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

అమరాపురం: పాము కాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అమరాపురంలోని కోటవీధిలో నివాసముంటున్న మడివాళప్ప (55) ఇంటి పక్కనే పొలాన్ని కౌలుకు తీసుకుని పంటల సాగుతో పాటు గడ్డివామి ఏర్పాటు చేసుకున్నాడు. గత మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో గడ్డివామికి టార్పాలిన్ కప్పి ఉంచాడు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం టార్పాలిన్‌ను తొలగిస్తుండగా ఎడమ చేతి మణికట్టుపై పాము కాటు వేసింది. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మెరుగైన వైద్యం కోసం మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక గురువారం సాయంత్రం ఆయన మృతి చెందాడు. మృతుడి కుమారుడు యంజేరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ జనార్దననాయుడు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION

■ ఆంధ్ర యూనివర్సిటీ & ANU అడ్మిషన్స్ జరుగుచున్నవి. B.A, B.Com, B.Sc, (TM/EM) (All Groups), M.A, M.Com, M.Sc (All Subjects) M.B.A, M.S.W, B.Li.Sc, M.Li.Sc. డా॥ బి. మధుసూదన. ఫోన్ : 83282 79245 [V- 6522]

EDUCATION

■ JIPS PARAMEDICAL AND VOCATIONAL COLLEGE KURNOOL: FREE AND MANAGEMENT SEATS AVAILABLE: 10TH PASS: MLT, MPHW(ANM) 12TH PASS: DANS(ANESTHESIA) DMLT(LAB TECHNICIAN) DMST (OT) DMPHA (MALE NURSING FREE SEATS). CELL: 8686172989,8309352305, 9440716644. [L-796403]

REAL ESTATE

భవనం అమ్మకానికి కలదు

■ ATP, దేవి నర్సింగ్ హోమ్ సమీపంలో చాలా గొప్ప కొత్త భవనం (G+5+సెల్లార్), అమ్మకానికి ఉంది. (ఆసుపత్రి, కళాశాల, అపార్ట్‌మెంట్లు, మాల్స్, జ్యూవెలరీ షాప్స్‌కి అనువైనది). సెల్ : 9000993793. [A-1283]

DUPLEX VILLAS FOR SALE

■ అనంతపురం to తాడిపత్రి, హైవే రోడ్డుకు BKS దాటాక, నూతన గేటెడ్ కమ్యూనిటీ నందు 2BHK & 3BKH డూప్లెక్స్ విల్లాలు అమ్మబడును. సంప్ర:- 9515860608, 7396540409 [A-303]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6521]

WANTED

■ అనంతపురం నందు పనిచేయుటకు Gunman కావలెను. అర్హత Ex-Servicemen మాత్రమే. Age Under 58. Contact: Cell No: 8309988794. [A-1285]

■ సెక్యూరిటీగార్డ్స్, ఆఫీస్‌బాయ్స్ (M), ప్యాకింగ్ హెల్పర్, హౌస్‌కీపింగ్ (F) బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం గుత్తిటౌన్ & KPS సినిమాహాల్ దగ్గర పనిచేయుటకు కావలెను.8074444019,9676392502. [T-1262275]

■ MNC కంపెనీలో బ్యాంకింగ్ IT M/F కావలెను. సాలరీ: 20K to 35K, Qly: MBA, MCA, B.Tech, డిగ్రీ, ఇంటర్, 10th. సంప్ర: 9704971984 [H-801649]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185353]

■ BUZZ GROUPS - Looking for FIELD MARKETING EXECUTIVES (Male / Female) With Good Looking & Good Communications. Eligibility - FRESHERS (Any Qualification - Min. Intermediate) Salary - 12000/- TO 15,000/-. Venue: ANANTAPUR. Contact: 9281029731 / 8886008060. WWW.BUZZGROUPS.IN [A-762333]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.